విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

జిల్లాలో ఓటర్లు 15,88,622 మంది

విశాలాంధ్ర -ఏలూరు: ఏలూరు జిల్లా కలెక్టరేట్ గౌతమీ సమావేశపు హాలులో శుక్రవారం గుర్తింపు పొందిన రాజకీయ పక్షాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఎస్ఎస్ఆర్ -2024 డ్రాఫ్ట్ పబ్లికేషన్ ను జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ విడుదల చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఎస్ఆర్ -2024లో భాగంగా జిల్లాలో 15,88,662 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీరిలో పురుష ఓటర్లు 7,78,884 మంది, మహిళా ఓటర్లు 8,09,615 మంది, థర్డ్ జెండర్ ఓటర్లు 123 మంది ఉన్నారన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేశామన్నారు. డ్రాఫ్ట్ పబ్లికేషన్ లో భాగంగా ఓటర్ల జాబితాలో ఏవైనా క్లెయిమ్స్, అభ్యంతరాలు ఉంటే డిసెంబర్ 9వ తేదీలోపు తెలియజేయాలన్నారు. అర్హులై ఉండి ఎవరికైనా ఓటర్ జాబితాలో పేరు రాకపోయినా, వారి పేరు తొలగించినా ఆన్లైన్ ద్వారా కూడా క్లెయిమ్స్, అభ్యంతరాలు తెలియజేయవచ్చన్నారు.

దరఖాస్తుదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలి

జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-కలిదిండి: జగనన్నకు చెబుదాం స్పందన దరఖాస్తుపై చివరి తేదీ వరకు వేచిచూడకుండా దరఖాస్తు అందిన మొదటి రోజునే పరిశీలించాలని, దరఖాస్తుదారుడు సంతృప్తి కలిగే రీతిలో పరిష్కార విధానం ఉండాలని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ అన్నారు. జగనన్నకు చెబుదాం జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం కలిదిండిలోని కళ్యాణి ఫంక్షన్ హాలులో శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి, అదనపు ఎస్.పీ భాస్కర్, ఆర్డీఓ ఎస్.ఎస్ కె. ఖాజావలితో కలిసి ప్రజలనుండి వినతులను స్వీకరించారు. శుక్రవారం జరిగిన స్పందనలో 157 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి జిల్లా స్థాయి అధికారులతో కలిసి మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం నిర్వహిస్తు న్నామన్నారు. కలిదిండి మండలంలో స్పందన దరఖాస్తు లను అధికారులు మరింత సమగ్ర విచారణ చేసి పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి వై. రామకృష్ణ, జిల్లా పౌర సరఫరాల అధికారి రాజు, అధికారులు పాల్గొన్నారు.

రూ.3,05,420 పెనాల్టీ విధింపు

జిల్లా రవాణా కమిషనర్ ఎస్.శాంతకుమారి

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తున్న పలు బస్సులకు సంబంధించి రూ.3 లక్షల5 వేల 420లు అపరాధ రుసుము, ట్యాక్స్ , పెనాల్టీ విధించినట్లు ఏలూరు జిల్లా రవాణా కమిషనర్ ఎస్.శాంతకుమారి తెలిపారు. దసరా పండుగ సందర్భంగా ఈ నెల 15వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ప్రైవేటు వాహనములపై ప్రత్యేక తనిఖీలు రాత్రి 8 గంటల నుంచి అర్ధరాత్రి ఒంటిగంట వరకునిర్వహించాలని ఈ నెల 13 వ తేదీన సంబంధిత రవాణా శాఖ అధికారులు,సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. తనిఖీల్లో భాగంగా ఈ నెల 18వ తేదీన 10 ప్రైవేటు బస్సులకు, 21వ తేదీన ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తున్న 9 బస్సులకు మొత్తం అపరాధ రుసుము, ట్యాక్స్, పెనాల్టీ కింద రూ.3 లక్షల5వేల 420 విధించామన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - గణపవరం: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తున్నారని, ఇది పేద ప్రజలకు మంచి అవకాశం అని గణపవరం మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి గద్దల జ్యోతిర్మయి అన్నారు. శుక్రవారం గణపవరం మండలం అప్పన్నపేట గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం గ్రామ సర్పంచ్ నూకరపు సుధాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్యులు అందించే సేవలుఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్య క్రమంలో ఎంపీటీసీ సభ్యులు కొల్లి సత్యనారాయణ, వై ఎస్ ఆర్ సి పి గ్రామ నాయకులు, జల్లి కాకినాడ సర్పంచ్ బాతు నాగేశ్వర రావు, కేశవరం సర్పంచ్ నాగేశ్వరరావు, తహసీల్దార్ పమ్మి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూములపై విజిలెన్సు విచారణ

విశాలాంధ్ర- ముసునూరు: మండలంలోని అటవీపోరంబోకు భూముల పై పెద్దల కన్ను పడినట్లు విచారణలో తేలడంతో ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం మండలంలోని కాట్రేనిపాడు గ్రామంలోని అటవీ భూముల పై ఏలూరు జిల్లా విజిలెన్స్ ఎన్ఫోర్సుమెంట్ వారు ముసునూరు మండల రెవెన్యూ తహశీల్దార్ దాసరి సుధ,గ్రామ రెవిన్యూ అధికారులను విచారణ నిమిత్తం చేపట్టారు. అటవీ భూమి సుమారు య.7242 ఎకరాలు వుండగా 2018-2022 సంవత్సరాల మధ్య కాలంలో ఆర్.ఎస్ నెంబరు 454-1 నుండి 94 సబ్ డివిజన్‌లో ,వెబ్ ల్యాండ్‌లో నూతన సర్వే నెంబర్‌లను క్రియట్ చేసి ఆక్రమణలదారులకు ఆన్‌లైను చేసినట్లు వివరాలు ,సుమోటుగా మార్చినట్లు తెలిపారు. ఫారెస్టు భూమిని పట్టా భూమిగా మార్చడంతో ఆ గ్రామం లోని భూమి రెండంతలు వ్యత్యాసం కనబరుస్తుందని తెలిపారు.వీరితో పాటు ఫారెస్టు అధికారులైన డిఆర్ఓ జి.విజయశేఖర్, గార్డ్ శివయ్య ,రేవిన్యూ అధికారులతో విజిలెన్సు ఎన్ ఫోర్సుమెంట్ అధికారులు ఆక్రమణలో వున్న పది సర్వే నెంబర్ల భూమిని పరిశీలించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలంతా వినియోగించుకోవాలని పోలవరం శాసనసభ్యులు తెల్లం బాలరాజు పేర్కొన్నారు. మండలంలో కన్నాపురం గ్రామంలో శుక్రవారం తహసీల్దారు పి. నాగమణి అధ్యక్షతన, సర్పంచ్ ఉప్పల పద్మావతి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన తెల్లం బాలరాజు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో ఉన్న గ్రామీణ ప్రాంతాలలో, పట్టణాలలో, ప్రజలు సరైన వైద్యం లేక అనేకమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి ఆరోగ్య పరిరక్షణ కోసం గ్రామాలలో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వ వైద్యులు వచ్చి అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తున్నారని అవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు, ఏఎన్ఎంలు,ఆశ వర్కర్లు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడి కేంద్రాల టీచర్లు, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేద రైతులను ఆదుకోవాలి

విశాలాంధ్ర-ఏలూరు: రాష్ట్రంలో ఏర్పడిన కరువు పరిస్థితుల కారణంగా కరువు మండలాలు గుర్తించి ఆ మండలాల్లోని గ్రామీణ పేదలను పేద రైతులను ఆదుకోవాలని బికేఎంయు ఏలూరు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఏలూరు మండల కార్యదర్శి పాటేలు పెంటయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఏలూరు రూరల్ మండలం చాటపర్రు గ్రామ సచివాలయ కార్యదర్శికి బికేయంయు నాయకులు వినతి పత్రం అందజేశారు. కరువు మండలాలలో పనులు లేని వ్యవసాయ కూలీల కుటుంబాలకు చిన్న, సన్నకారు రైతుల కుటుంబాలకు కరువు పెన్షన్ కింద నెలకు రూ.10వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒక్కొక్క కుటుంబానికి 35 కేజీలు బియ్యం ఉచితంగా ఇవ్వాలని, వ్యవసాయ కూలీల ఇతర పేదల విద్యుత్ బిల్లులను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధి హామీ పనులను కుటుంబానికి 200 రోజులు పని దినాలు కల్పించి రోజు కూలి రూ.600 ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపి వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు మండల నాయకులు బుగ్గల ప్రభాకర్, బుల్లి ఏసు రత్నం, అరిగెల యోహాన్, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో : రాష్ట్రవ్యాప్తంగా ఏర్పడిన కరువు వలన ఇబ్బందులు పడుతున్న వ్యవసాయ కూలీ కుటుంబాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మండలంలోని బోడిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం సిపిఐ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం పిలుపుమేరకు సచివాలయ సిబ్బందికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర, రాయలసీమ, ప్రకాశం, జిల్లాల్లో అత్యంత దారుణంగా కరువు ఛాయలు ఏర్పడ్డాయని " డౌన్ టు ఎర్త్" సంస్థ విశ్లేషణ ప్రకారం ఆంధ్రప్రదేశ్ లో కోస్తా తీరం వెంబడి ఉన్న జిల్లాల్లో కూడా తీవ్ర కరువు పరిస్థితుల నెలకొన్నాయని విశ్లేషణ చేసిందన్నారు. కరువు, నుండి పేదలను, వ్యవసాయ కూలీలను, రైతులను విముక్తి చేసి వలసలు వెళుతున్న వారిని ఆపడానికి కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని శ్రీనివాస రావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో చిక్కిరెడ్డి సోమరాజు, జక్కు చంద్రం, జక్కు సీతయ్య,జక్కునాగేశ్వరరావు, జక్కు సూరిబాబు, మెంటే శ్రీరాములు,మెంటే నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

కుక్కునూరులో: మండలంలో వర్షాభావ పరిస్థితుల వలన వ్యవసాయ కూలీలు, రైతులు తీవ్ర కరువు కోరల్లో చిక్కుకొని అల్లాడుతున్నారని ప్రభుత్వం తక్షణమే స్పందించి వ్యవసాయ కూలీలను, పేద రైతులను ఆదుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని తొండిపాక గ్రామ సచివాలయం వద్ద పనులు లేక ఇబ్బందులు పడుతున్న వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. గ్రామ సచివాలయ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మైసాక్షి వెంకటాచారి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కూరాకుల బాబురావు, మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులవల్ల వ్యవసాయ కూలీలు, గ్రామీణ పేదలు జీవనం కోసం వలసలు వెళ్లే పరిస్థితులు ఏర్పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకొని ఉపాధి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కరకూరి జయబాబు, మడకం రవీంద్ర, ఊకే బాబు, మడకం కమల్ తదితరులు పాల్గొన్నారు.

వేలేరుపాడులో: వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఐ ఆధ్వర్యంలో శుక్రవారం రామవరం సచివాలయం ముందు ధర్నా చేశారు. మండలంలోని వివిధ సచివాలయాల ముందు గత మూడు రోజులుగా కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేస్తున్న విషయం విధితమే. రైతులు ఈ ఏడాది తీవ్రంగా నష్టపోయారని తద్వారా వ్యవసాయ కూలిపై ఆధారపడిన వందల కుటుంబాలకు సరైన ఉపాధి కరువైందన్నారు. ప్రభుత్వం పేద కుటుంబాలను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య, మండల కార్యదర్శి బాడిశ రాము, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు మడివి కామయ్య, పెర్ల వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబు, రామవరం సర్పంచ్ పిట్టా ప్రసాద్, బంధం అర్జున్, బంధం నాగేశ్వరావు, కంగాల పండయ్య, మడివి లెనిన్, మల్లవరపు తెజా, బంధం ముత్యాలరావు, బంధం భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో: వర్షాలు లేక పంటలు ఎండిపోతున్న రైతులను,గ్రామీణ ప్రాంతాల్లో పనుల్లేక ఇబ్బందులను ఎదుర్కొంటున్న వ్యవసాయ కూలీలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం (బికేఎంయు) ఏలూరు జిల్లా కార్యదర్శి కుంచె వసంత రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఏపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి పిలుపు మేరకు చేపట్టిన సచివాలయాల వద్ద ధర్నా కార్యక్రమాలు శుక్రవారంతో మూడవ రోజుకు చేరుకున్నాయి. శుక్రవారం మండలంలోని పంగిడిగూడెం గ్రామ సచివాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి జి.సుబ్బలక్ష్మి కి వినతి పత్రం సమర్పించారు. అనంతరం కుంచె వసంతరావు మాట్లాడుతూ వర్షాలు తక్కువగా కురవడంతో పంటలకు నీరందక ఎండిపోతు న్నాయని, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులు,వ్యవసాయ కూలీలకు ఆర్థిక సహాయం అందించి గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిహామీ పనులను వెంటనే ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ మండల కార్యదర్శి జె.వి.రమణ రాజు మాట్లాడుతూ కరువు ప్రాంతా లను వెంటనే గుర్తించి పేద రైతులు, వ్యవసాయ కూలీలను ఆదుకుని వారికి ఆర్థిక చేయూతనందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కలపాల శ్రీరాములు, గొలిమే బాలయేసు, నంబూరు ఆనందరావు, గట్టియ్య, బుడె ఆశీర్వాదం, కుంచే పాప, పరమానందం, ఇస్రాయేలు లక్కా బత్తుల వెంకటేశు, బేతాళ కోటి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు ముందస్తు ప్రణాళిక

జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర- భీమవరం: జిల్లాలో రైతుల నుండి ధాన్యం సేకరణకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకొని, ఎక్కడ ఎటువంటి సమస్యలు లేకుండా పకడ్బందీగా జరపాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి డివిజన్, మండల స్థాయి అధికారులతో ధాన్యం సేకరణ, రీ సర్వే, స్టోన్ ప్లాంటేషన్, ఎలక్షన్ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లకు ఆర్.బి.కెలో పూర్తిస్థాయిలో ముంద స్తు ఏర్పాట్లు చేయాలన్నారు. ఇప్పటికే అన్ని ఆర్.బి.కెలలో ధాన్యం కొనుగోలుకు కావలసిన మెటీరియల్ అందజేసినట్టు తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని అధికారులు సమన్వయంతో పని చేస్తే మంచి ఫలితాలు వస్తాయని ఆమె అన్నారు. వాహనాలకు రిజిస్ట్రేషన్ పూర్తి చేసి జీపీఎస్ డివైజ్ అమర్చాలని ఆమె సూచించారు.ఈ సమావేశంలో డిఆర్ఓ కె. కృష్ణవేణి, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ కానాల సంగీత్ మాథుర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్‌గా సుబ్బారావు బాధ్యతల స్వీకారం



విశాలాంధ్ర-ఏలూరు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జిల్లా ప్రజా పరిషత్ కార్యనిర్వహణ అధికారిగా బాధ్యతలు చేపట్టిన కె .ఎస్. ఎస్ .సుబ్బారావు ఏలూరు కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ జెడ్ పి సీఈఓ ను అభినందించారు.

CHANGE OF NAME

I, TANGIRALA SURYANARAYANA SHARMA (NEW NAME), S/o TANGIRALA SRINIVASA SARMA, Previously called TANGIRALA SURYANARAYANA SARMA (OLD NAME), Resident of H. No.13-3-6/1A, Goteti vari Street, Ramachandra Rao Pet, Tadepalligudem Town and Mandal, West Godavari District, Andhra Pradesh, Now Changed my name from TANGIRALA SURYANARAYANA SARMA (OLD NAME) to TANGIRALA SURYANARAYANA SHARMA (NEW NAME) Today onwards Use my New Name for all further Transactions.

CHANGE OF NAME

I, PALLEM SANTHI (NEW NAME), W/o CHAVALA RAJANI KANTH, Previously called CHAVALA SANTHI (OLD NAME), Resident of H. No. 1-182, Varahapatnam, Kaikaluru Mandal, Eluru District, Andhra Pradesh, Now Changed my name from CHAVALA SANTHI (OLD NAME) to PALLEM SANTHI (NEW NAME) Today onwards Use my New Name for all further Transactions.

CHANGE OF NAME

I, TANGIRALA LALITHA RANI (NEW NAME), W/o TANGIRALA SURYANARAYANA SHARMA, Previously called TANGIRALA LALITHA (OLD NAME), Resident of H. No.13-3-6/1A, Goteti vari Street, Ramachandra Rao Pet, Tadepalligudem Town and Mandal, West Godavari District, Andhra Pradesh, Now Changed my name from TANGIRALA LALITHA (OLD NAME) to TANGIRALA LALITHA RANI (NEW NAME) Today onwards Use my New Name for all further Transactions.

కార్మిక హక్కుల పరిరక్షణ దినంగా ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించాలి

విశాలాంధ్ర-ఏలూరు: కార్మిక హక్కుల పరిరక్షణ దినంగా ఈనెల 31వ తేదీన ఏఐటియుసి 104వ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించాలని ఏఐటీ యూసీ జాతీయ సమితి పిలుపు నిచ్చిందని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వర రావు తెలిపారు. ఏఐటీయూసీ 104వ వ్యవస్థాపక దినోత్సవం ఈనెల 31వ తేదీన ఘనంగా జరపాలని శుక్రవారం స్థానిక కోటదిబ్బ ఎస్ఆర్‌వన్ వద్ద ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ)నాయకులు, కార్యకర్తలు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏఐటియుసి

నాయకత్వాన కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను మోడీ నాయకత్వాన ఎన్డీఏ ప్రభుత్వం 4 లేబర్ కోడ్‌లుగా మార్పు పేరుతో కాలరాస్తున్నదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలపైన ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసే విధానాల పైన ఉద్యోగ కార్యకవర్గం సమరశీల పోరాటాలకు సంసిద్ధం కావాలని ఆయన కోరారు. ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ. అప్పలరాజు మాట్లాడుతూ అవుట్సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కనీస వేతనం నెలకు రూ.26వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్ఎంవి సుబ్బారావు, షేక్‌అలీ, డి. వెంకటేష్, కే రామచంద్రరావు, ఎం. ఆదినారాయణ, ఆర్. శ్రీనివాసరావు, పి. చందు, డి.దుర్గా ప్రసాద్, సిహెచ్ హరినాథ్‌బాబు, బి. దుర్గారావు, కె. రామకృష్ణ, ఎ.గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

కామవరపుకోటలో : ఈనెల 31వ తేదీన ఏఐటియుసి వ్యవస్థాపక దినోత్సవం కార్మిక సంఘాలు ఘనంగా జరుపుకోవాలని ఏఐటియుసి చింతలపూడి ఏరియా గౌరవాధ్యక్షులు టీవీఎస్ రాజు కార్మిక సంఘాలకు పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం రాకపూర్వమే నాడు స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న వామపక్ష భావజాలంతో కూడిన నేతలంతా కలిసి కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని పోరాడిన చరిత్ర ఉందన్నారు. కార్మిక హక్కులను కాపాడటం కోసం భారతదేశంలో తొలి సారిగా ఆవిర్భవించిన ఏకైక కార్మిక సంఘం ఏఐటీయూసీ మాత్రమేనన్నారు.నాటి నుండి నేటి వరకు దేశవ్యాప్తంగా ఉన్న గ్రామీణ ముఠా కార్మిక సంఘాలతో పాటు రైల్వే, ఆర్టీసీ, బ్యాంక్ ఉద్యోగులు తదితర సంస్థల్లో పని చేసిన కార్మికుల ఐక్యపరిచి వారి హక్కుల కోసం ఏఐటీయూసీ అవిశ్రాంత పోరాటం చేసింద న్నారు. ఈ నెల 31న ఏఐటియుసి వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా జరుపుకోవా లని వివిధ కార్మిక సంఘాలను ఆయన కోరారు.

నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేపై అవగాహన

విశాలాంధ్ర-టి నరసాపురం: నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేపై ప్రధానోపాధ్యాయులు అవగాహన కలిగి వుండాలని మండల విద్యాశాఖాధి కారి టి. రామ్మూర్తి తెలిపారు. స్థానిక మానవ వనరుల కేంద్రంలో నేషనల్ అఛీవ్మెంటు సర్వే పై ప్రధానోపాధ్యాయులకు శుక్రవారం శిక్షణాకార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఎంపికైన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 3,6,9 తరగతులు చదివే విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేయడానికి నంబరు 3 వ తేదీన పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పరీక్ష విధి విధానాలు ప్రధానోపాధ్యాయులకు వివరించ డంతో సమర్థవంతంగా విద్యార్థులు పరీక్ష వ్రాయడానికి శిక్షణ ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యా శాఖాధికారిణి ఎస్. కళ్యాణి,పలువురు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బందిని నియమించాలి

విశాలాంధ్ర-ఏలూరు: ప్రభుత్వ ఆసుపత్రిలో సరిపడా సిబ్బంది లేక అనారోగ్యంతో వచ్చిన పేదలు ఇబ్బంది పడుతున్నారని తక్షణం ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బందిని నియమించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి. రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా ఆసుపత్రిలో ఎక్సరే డిపార్ట్మెంట్ లో ఎక్సరేకి వచ్చిన రోగులు సిబ్బంది లేకపోవడంతో నానా అవస్థలుపడుతున్నారని తెలిపారు. ఇక్కడ ఎక్సరే వచ్చిన అనేక మంది పేదలు కాళ్ళు,చేతులు, తలకు, దెబ్బలు తగిలిన వ్యక్తులు వస్తూంటారనిఅన్నారు. సిబ్బంది చీటీలు, ఎక్సరే తీసేవారు ఒక్కరే ఉన్నారని దీని వలన రోగులు అనేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, వైద్య సిబ్బంది రోగులను పట్టించుకోవాలని వారి సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధిలో భీమవరంను అగ్రగామిగా నిలుపుతాం

విశాలాంధ్ర -భీమవరం టౌన్: అభివృద్ధిలో భీమవరం పట్టణాన్ని అగ్రగామిగా నిలుపుతామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలో 34 వ వార్డు నందు నిమ్మ కాయల వారి వీధిలో రూ. 7 లక్షల నిధులతో నిర్మించిన సిసి రోడ్డు, డ్రైన్ ను, ఆర్ఆర్ డి ఎస్ కాలేజీ నుండి సూర్య టవర్స్ వరకు రూ.28 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి అనేది మాటల్లో కాదని చేతల్లో చేసి చూపించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. పట్టణంలో సుమారుగా 8 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేసి, గృహ నిర్మాణాలకు రూ.1లక్ష 80 వేల నిధులను ఉచితంగా అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ప్రతి ఒక్కరు సొంత ఇంటిని కలిగి ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, మున్సిపల్ కమిషనర్ ఎం. శ్యామల, ముదునూరి సుబ్బరాజు,తోట భోగయ్య ,ఏ ఎస్ రాజు, గాదిరాజు సుబ్రహ్మణ్య రాజు, కోడే యుగంధర్, సాంబ్రాణి నరేష్, స్వాతి సుబ్బరాజు, కందికట్ల ఎడ్వర్డ్, మున్సిపల్ ఎంఇ త్రినాధరావు , మున్సిపల్ ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బస్సుయాత్ర విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-ఏలూరు: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేసి సామాజిక బస్సు యాత్రను విజయవంతం చేయాలని వైసిపి ప్రాంతీయ సమన్వయకర్త, ఎంపీ మిథున్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక సారథి ఫంక్షన్ హాలులో వైసిపి ఏలూరు జిల్లా కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశం జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మిథున్ రెడ్డి మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజల గడప వద్దకు చేరువ చేశామన్నారు. సభకు అధ్యక్షత వహించిన మాజీ శాసనసభ్యులు, వైసీపీ ఏలూరు జిల్లా అధ్యక్షులు ఆళ్ళ నాని మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో అధికారం దక్కదని అక్కసుతో ప్రభుత్వం, ముఖ్యమంత్రి జగన్ పై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాలను క్షేత్రస్థాయిలో తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్సీలు కవురు శ్రీనివాస్, జయమంగళ వెంకటరమణ, వంకా రవీంద్రనాథ్, జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, తెల్లం బాలరాజు, అబ్బయ్య చౌదరి, మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, దూలం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అటల్ పెన్షన్‌తో వృద్ధాప్యంలో ఆసరా

విశాలాంధ్ర-మండవల్లి: అటల్ పెన్షన్ పథకంలో చేరిన వారు వృద్ధాప్యంలో చింతలు లేకుండా జీవించవచ్చని మండవల్లి ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు అన్నారు. అయ్యవారిరుద్రవరం గ్రామంలో బ్యాంకు ద్వారా అందిస్తున్న ప్రభుత్వ పథకాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ 18 నుండి 50 సంవత్సరాల వయస్సున్నవారు ఏడాదికి 436 రూపాయలు చెల్లించి ప్రధానమంత్రి జీవన జ్యోతి పథకంలో చేరవచ్చన్నారు.ఏదైనా కారణాలతో పాలసీదారు మరణిస్తే రూ.రెండు లక్షలు భీమా పరిహారం నామినికి అందిస్తామన్నారు.ఏడాదికి 20 రూపాయలు చెల్లించి 18 నుండి 70 ఏళ్లవారు ప్రమాదవశాత్తు మరణిస్తే రెండు లక్షలు అందిస్తామన్నారు.శాశ్వత అంగవైకల్యంకు 2లక్షలు, ఒకఅవయవం కోల్పోతే లక్ష అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇటీవలి అయ్యవారిరుద్రవరంలో మరణించిన పఠాన్ పాతిమున్నీసాకు పిఎంజెవై భీమా సొమ్ము రెండు లక్షల చెక్కును అందించారు.ఐక్యవేదిక నాయకులు, పంచాయతీ సభ్యులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ ప్రశంసలందుకున్న లిటిల్ ఫ్లవర్స్

విశాలాంధ్ర-ముదినేపల్లి : పరీక్షపై చర్చా కార్యక్రమంలో విలువైన అభిప్రాయాలను తెలిపినందుకు ముదినేపల్లి లిటిల్ ఫ్లవర్ స్కూల్ విద్యార్థులు గంట్యాడ రవికిరణ్, పేరుబోయిన ఊహ, యర్రం శెట్టి రేష్మ, మత్తి దివ్యశ్రీలు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కార్యాలయం నుంచి ప్రశంసా పత్రాలు అందుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బలుసు రఘురామయ్య తెలిపారు. విద్యార్థులలో పరీక్షల పట్ల భయాన్ని, ఒత్తిడిని నివారించేందుకు ఐదు అంశాలపై ప్రధాని మోడీ ఈ ఏడాది జనవరి 27న పరీక్ష పే చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానితో విద్యార్థులు పాఠశాల ఉపాధ్యా యుల సహకారంతో తమ ఆలోచనలు పంచుకున్నారు. అందుకు విద్యార్థు లకు పిఎమ్ఓ కార్యాలయం నుండి ఈ పత్రాలు అందుకున్నట్లు వైస్ ప్రిన్సి పాల్ బి. సుమిత్ సాయి తెలిపారు. విద్యార్థులను అధ్యాపకులు, విద్యార్థులు , సిబ్బంది అభినందించారు.

ఓపెన్ హౌస్



విశాలాంధ్ర-ఆగిరిపల్లి: అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌లో జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులకు ఓపెన్ హౌస్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆగిరిపల్లి ఎస్ఐ నంబూరి చంటి బాబు ఆయుధాలు పనిచేసే విధానము ,రిసెప్షన్ కౌంటర్, రికార్డ్ రూమ్,పోలీస్ స్టేషన్‌లో నిర్వహించే కౌన్సిలింగ్ తో పాటు కొన్ని విషయాల పట్ల అవగాహన కల్పించారు. విద్యార్థులు ఎంతో శ్రద్ధగా విని తెలుసుకుని అనేక రకాల ప్రశ్నలు అడగగా ఎస్ఐ విద్యార్థులకు అర్థమయ్యే విధంగా పోలీస్ స్టేషన్ విధి విధానాలు వివరించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, ఆగిరిపల్లి మహిళా పోలీసులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి మహిళ మృతి

విశాలాంధ్ర-టి నరసాపురం: భర్త వేధింపులు తాళలేక మహిళ పురుగుల మందు తాగి మృతి చెందిన సంఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల తెడ్లం గ్రామానికి చెందిన మోర్ల పావని (29)కి శివన్నారాయణతో 12 సంవత్సరాల క్రితం వివాహమైంది. కొంతకాలంగా శివన్నారాయణ భార్యను మానసికంగా వేధించటంతో ఈ నెల 23 వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మ హత్యా యత్నానికి పాల్పడింది.కుటుంబ సభ్యులు ఆమెను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.చికిత్స పొందుతూ శుక్రవారం ఆమె మృతి చెందింది. మృతురాలి తల్లి సిరిబత్తుల రాజేశ్వరి ఫిర్యాదుతో ఎస్ఐ బి. సురేంద్ర కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న జనసేన ధర్మరాజు

విశాలాంధ్ర - నిడమర్రు: దేవీ నవరాత్రులు పురస్కరించుకుని నిడమర్రు మండలం తోకలపల్లి గ్రామంలో దేవి నవరాత్రుల ముగింపు సందర్భంగా శుక్రవారం గ్రామ కూడలిలో ఏర్పాటు చేసిన భారీ అన్న సమారధన కార్యక్రమంలో జనసేన నాయకులు ధర్మరాజు పాల్గొన్నారు. కనకదుర్గ అమ్మ వారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వంగ రఘు, గ్రామ పెద్దలు, గ్రామ జనసైని కులు, తదితరులు పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలి

విశాలాంధ్ర-మండవల్లి: భ్రమరాంభాసమేత మల్లేశ్వరస్వామి వారి ఆశీస్సులు ప్రజలందరికి ఉండాలని శాసనసభ్యులు దూలం నాగేశ్వరరావు అకాంక్షించారు. మండవల్లి గ్రామంలోని శివాలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించగా ఆలయ సన్నిధిలో అఖండ అన్నసమారాధన జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అన్నసమారాధనలో భక్తులకు ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొల్లా కృష్ణ, కార్యనిర్వహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు,స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

విశాలాంధ్ర-మండవల్లి: సురక్షితమైన తాగునీటిని పౌరులందరికి అందిం చేందుకు చర్యలు చేపడుతున్నామని తాగునీటి చెరువులను పూర్తి స్థాయిలో నింపి తాగునీటి సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని మండవల్లి గ్రామ సర్పంచ్ మెండా జాన్సి అన్నారు. గ్రామంలోని కొండరాయి చెరువుకు నీటిని నింపే ప్రక్రియను సర్పంచ్ పరిశీలించారు. కుళాయిలకు సకాలంలో నీటిని అందించేందుకు ప్రణాళికలు రూపొందించా మన్నారు.కార్యక్రమంలో వైసిపి నాయకులు మెండా సురేష్‌బాబు,పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అన్న సమారాధన

విశాలాంధ్ర-భీమవరం టౌన్: దసరా శరన్నవరాత్రుల ముగింపు సందర్భంగా పట్టణంలోని మెంటే వారి తోటలో వెలసిన శ్రీబాల త్రిపుర సుందరి దేవి అమ్మవారి ఆలయంలో శుక్రవారం జరిగిన భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. ముందుగా అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు భక్తి భావంతో ఉన్నప్పుడే సమాజంలో శాంతి నెలకొంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, మద్దాల సత్యనారాయణ, సమతం తాతాజీ ,లీల,తోట భోగయ్య, కోడె యుగంధర్, ఏ ఎస్ రాజు, కొప్పర్తి సత్యనారాయణ, పెన్నాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్‌హౌస్‌పై అవగాహన

విశాలాంధ్ర- ముసునూరు: ఏలూరు జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆదేశాలనుసారం

ముసునూరు ఎస్ఐ యం.కుటుంబరావు ఆధ్వర్యంలో ఆమరువీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ముసునూరు జిల్లా పరిషత్ వున్నత పాఠశాల విద్యార్థు లకు ఓపెన్‌హౌస్ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆయుధాలు పనిచేసే విధానం,కౌంటర్ ఫైల్ విధానం,పోలీస్ స్టేషన్ నందు నిర్వహించే కౌన్సిలింగ్ ఇలా పలు అంశాలతో కూడిన వివరాలు విద్యార్థిని,విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పేదలకు ఉచిత వైద్య శిబిరాలు అవసరం

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈతకోట భీమశంకర్ రావు

(తాతాజీ) అన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు ఈతకోట తాతాజీ పుట్టినరోజు పురస్కరించుకుని పట్టణంలో పలుచోట్ల ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. కామినేని ఆసుపత్రి సౌజన్యంతో గుండె వైద్య శిబిరం, లైన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్య సిబ్బంది రీజియన్ చైర్ పర్సన్ మదన్ మోహన్ అగర్వాల్ ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో తాతాజీ మాట్లాడుతూ వైద్యం ఖరీదుగా మారిన తరుణంలో పేదలకు వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నా యని అన్నారు. ఈ వైద్య శిబిరాలు ఉచితంగా మందులను పంపిణీ చేయడంతో పాటు అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేయవలసి వస్తే తమ తరపున ఆర్థిక సహకారం అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు నరిసే సోమేశ్వరరావు, గట్టెం మాణిక్యాలరావు, తన బుద్ధి భోగేశ్వర రావు, తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర -కలిదిండి: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో సమస్యలను

పరిష్కరించాలని ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ లావణ్య వేణి ఆర్డీవో ఖాజావలిలకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి అంద్రాజు. శ్రీనివాసరావు, మండల ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు బళ్ల. రాజు కలసి దరఖాస్తు అందజేశారు. శుక్రవారం జగనన్నకు చెబుదాం స్పందన లో మండలంలోని జగనన్న కాలనీ లకు రోడ్లు, విద్యుత్ సౌకర్యం, మంచినీటి సౌకర్యం కల్పించాలని, కలిదిండి మండలం శివారు ప్రాంతం కావడం వల్ల ఆక్వా రైతులకు సాగునీరు అందడం లేదని ఉప్పుటేరు లోని నీరుని ఉపయోగించుకుని చేపలు, రొయ్యలు సాగు చేసుకుంటున్నారని, మట్టగుంట న్యూడ్రైన్, యడవల్లి డ్రైన్, మట్టకొడు డ్రైన్‌లలో గుర్రపుడెక్క కిక్కిసు గడ్డితో పూడిపోయి నందున నీరు పారుదల లేక నీరు రాక ఆక్వా రైతులు ఇబ్బంది పడుతున్నారని ఈ డ్రైన్లు పూడిక తీయాలని, యడవల్లి నుండి పెదలంక మీదుగా మూలంక వరకు రోడ్డు మరమ్మతు చేయాలని, గుర్వావాయిపాలెం నుండి సంతోషపురం వరకు రోడ్డు రిపేరు చేయాలని జాయింట్ కలెక్టర్‌కు అర్జీలు అందజేశారు.

ఓటర్ల జాబితా పూర్తి చేయాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : బూత్ లెవల్ అధికారులు, సూపర్వైజర్లు,ఓటర్ల జాబితా ప్రచురణలో అలసత్వం వహించకుండా ఓటర్ల జాబితాను త్వరగా పూర్తి

చేయాలని కొయ్యలగూడెం తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దారు పి. నాగమణి బూత్ లెవల్ అధికారులకు,సూపర్వైజర్లకు శుక్రవారం ఓటర్ల జాబితాల రివిజన్ విషయమై సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, బూత్ లెవల్ అధికారులు,సూపర్వైజర్లు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడలు అవసరం

విశాలాంధ్ర- తాడేపల్లిగూడెం : బాల్యం నుంచి చదువుతో పాటు క్రీడలు అవసరమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తనయుడు, వైకాపా యూత్ లీడర్ కొట్టు విశాల్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్ లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్ 14 అండర్ 17 బాల బాలికల క్రీడా పోటీలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి హాజరైన క్రీడాకారిణులైన బాలికల చేతుల మీదుగా క్రీడా పోటీలను ప్రారంభింప చేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ చదువు మనోవికా సాన్ని పెంచితే, క్రీడలు మనోధైర్యాన్ని, ఆత్మ బలాన్ని, దేహదారు ధ్యాన్ని ఇస్తాయన్నారు. క్రీడా కారులు ఆత్మవిశ్వాసంతో దేనినైనా సాధించ గలుగుతారన్నారు. బాల్యం నుంచి చదువుతో పాటు క్రీడల్లోనూ పాల్గొనడం ద్వారా మానసిక ఎదుగుదలతో పాటు శారీరక ఎదుగుదల ఉంటుందన్నారు. గ్రామీణ స్థాయి నుంచి మన పిల్లల్లో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ముఖ్యమంత్రి జగన్ ఆడుదాం ఆంధ్ర పేరుతో త్వరలోనే గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయి క్రీడాకారులను తయారు చేసేందుకు ప్రణాళిక రూపొందించారన్నారు. విద్య తోపాటు క్రీడ ల్లోనూ ఉత్సాహంగా పాల్గొని రాణించాలని విద్యార్థిని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇంచార్జ్ వట్టి బుజ్జి, ఎన్ సి సి కోచ్ గణపతి రావు, ఎంఈఓ టీవీ రామకృష్ణ, పిఈటిలు చింతకాయల సత్యనారా యణ, బడుగు చంద్రశేఖర్, ఇంకా పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

విశాలాంధ్ర-ఏలూరు: స్టార్టప్ ఇండియా పథకం కింద ఎస్‌సి, ఎస్‌టి

కమ్యూనిటీ నుంచి మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు సంబంధిత లబ్ధిదారులను గుర్తించి వారికి ఆయా రంగాల్లో శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేశ్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ స్టార్టప్ ఇండియా పథకం కింద అందిస్తున్న ప్రోత్సాహకాలను అందిపుచ్చుకునేందుకు ఎస్‌సి, ఎస్‌టి కమ్యూనిటీల నుంచి మహిళా వ్యవస్థాపకులను ప్రోత్సహించేందుకు ఔత్సాహికుల లబ్ధిదారులను గుర్తించి వారికి పరిశ్రమల శాఖచే ఆయా రంగంలో శిక్షణ అందించి వారితో సమగ్రమైన డాక్యుమెంటేషన్ తయారుచేసి వాటిని సంబంధిత బ్యాంకర్లకు సమర్పించడంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం పరిశ్రమల స్థాపనపై లభించు ప్రోత్సాహకాలు,అనుమతుల మంజూరు మొదలగు విధి విధానాలపై జిల్లా పరిశ్రమల కేంద్రం ప్రచురించిన అవగాహన బ్రోచర్లను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ విడుదల చేశారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం జె.నాగరాజా, డిప్యూటీ డైరెక్టర్ పి.ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

మందలపు వారి వివాహ వేడుకకు పర్వతనేని

విశాలాంధ్ర-చాట్రాయి: తెదేపా కార్యకర్త మందలపు సీతారామయ్య

కుమారుడి వివాహ వేడుకకు నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశం నాయకులు పర్వతనేని గంగాధర్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.శుక్రవారం చాట్రాయి మండలం తుమ్మగూడెం గ్రామానికి చెందిన మందలపు వారి వివాహ వేడుకకు హాజరైన గంగాధర్ నూతన వధూవరులు గోపాలకృష్ణ అనిత లను ఆశీర్వదించారు.కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కందుల కృష్ణ తెలుగు రైతు జిల్లా మాజీ కార్యదర్శి బొంతు సత్యనారాయణ టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు రాజా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

30 నెలల్లో నూజివీడు అభివృద్ధి చేసి చూపిస్తా

మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య

విశాలాంధ్ర -చాట్రాయి: ప్రస్తుత పరిస్థితిలో తనకు ఎమ్మెల్యేగా ఒక అవకాశం ఇస్తే కేవలం 30 నెలల వ్యవధిలో నూజివీడు నియోజకవర్గంలో సమగ్రమైన అభివృద్ధి చేసి చూపిస్తానని మాజీ శాసనసభ్యులు చిన్నం

రామకోటయ్య పేర్కొన్నారు.సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో చిన్నం రామకోటయ్య నూజివీడు నియోజకవర్గంలో మరోసారి వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. ఆత్మీయ సమ్మేళనం రాజకీయ చర్చ పేరుతో నియోజకవర్గంలో అన్ని గ్రామాలలో తనకు పూర్వం నుంచి ఉన్న పరిచయాలను ఉపయోగించి మరోసారి రాజకీయ చర్చలు సమావేశాలు ప్రారంభించారు. నియోజకవర్గం పునర్విభజన జరిగిన తరువాత చాట్రాయి మండలం నూజివీడు నియోజకవర్గంలో కలసిన తరుణంలో ప్రజారాజ్యం పార్టీలో రాజకీయ రంగ ప్రవేశం చేసి ఉద్యమం స్ఫూర్తి తో సేవాకార్యక్రమాలను నిర్వహించి ప్రజల మనస్సుల్లో చెరగని ముద్రలు వేశారు . చిరంజీవి పార్టీ టికెట్ ఇవ్వకపోయినా ఆయన చేసిన సేవలతో తెదేపా అధినేత చంద్రబాబు దృష్టిని ఆకర్షించారు. అనూహ్యంగా సీటు సాధించుకొని విజయం సాధించి సంచలనాలను సృష్టించారు. నియోజకవర్గంలో నెలకొన్న ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో మరోసారి రామకోటయ్య చూపు నూజివీడు నియోజకవర్గం పై పడింది. ఉమ్మడి రాష్ట్రంలో కేటాయించిన నిధుల కంటే రాష్ట్ర బడ్జెట్లో ప్రస్తుతం లక్షల కోట్ల రూపాయల నిధులు కేటాయిస్తున్నందున తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే కేవలం 24 నెలల నుంచి 30 నెలల కాలంలోనే విద్య వైద్యం ఉపాధి మౌలిక వసతుల కల్పన అన్ని రంగాలలో సమగ్రమైన అభివృద్ధి చేసి చూపిస్తానని ఆయన భరోసా కల్పించారు. స్వతంత్ర అభ్యర్థిగా వస్తున్న తనను బలపరచాలని తన మిత్రులను, శ్రేయోభిలాషులను, వివిధ రూపాలలో కలుస్తున్నారు చర్చలు జరుపుతున్నారు. దీనిలో భాగంగానే చాట్రాయి మండలంలోని జనార్ధన వరం ఆరుగురుపేట గ్రామాలలో వచ్చే ఆదివారం ఉదయం ఆత్మీయ సమ్మేళనం రాజకీయ చర్చ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చిన్నం రామకోటయ్య విశాలాంధ్రకు తెలిపారు. అభివృద్ధే ధ్యేయంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్న తాను రాజకీయాలకు అతీతంగా ముందుకు వస్తున్నట్లు తెలిపారు.

సారా విక్రేత అరెస్ట్

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : మండలంలో అంకాలగూడెం గ్రామంలో అక్రమంగా సారా విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ ఐ జి. జె. విష్ణువర్ధన్ పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం అంకాల గూడెం గ్రామానికి చెందిన తోట సురేష్ వద్ద నుండి 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్రమంగా సారా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సామాజిక తనిఖీ

విశాలాంధ్ర - తాళ్లపూడి : తాళ్లపూడి మండలం లోని వేగేశ్వరపురం గ్రామంలో ఖరీఫ్ 2023 సీజన్‌లో నమోదు చేసిన పంట వివరములను వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామ సర్పంచ్ కొమ్మిరెడ్డి పరసు రామారావు అధ్యక్షతన గ్రామ సభ లో చదివి వినిపించారు.. 29 వ తేదీ వరకు ప్రతి ఆర్.బి.కెల్లో పంట నమోదు జాబితా లు సామాజిక తనిఖీ నిమిత్తం ప్రచురించినట్టు తెలిపారు. పంట నమోదు వివరాలలో ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే రైతులు తమ అభ్యంతరాలను ఆర్.బి.కెల్లో గ్రీవెన్స్ రూపంలో సమర్పించి వివరాలను సరిచేయించుకునే అవకాశం ఉందన్నారు. రైతులు ఈ చివరి అవకాశాన్ని వినియోగించుకోవలసినదిగా వ్యవసాయ శాఖ ఏ.డి.ఏ. చంద్ర శేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖాధికారి రుచిత, సిబ్బంది పోసమ్మ , గౌతమి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

గోకవరంలో భారీ అన్న సమారాధన

విశాలాంధ్ర- గోకవరం: మండల కేంద్రమైన గోకవరంలో దసరా వేడుకలు ముగింపు సందర్భంగా వీరబద్దుని గద్దె వద్దగల కనకదుర్గ ఆలయం వద్ద శుక్రవారం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 5000 మంది భక్తులు ఈ సందర్భంగా పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు సుమారు పది రకాల వంటకాలతో అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు బత్తుల నానాజీ , ముమ్మిడివరపు నారాయణ, పసుమర్తి బుజ్జి, వాకచర్ల రవి, డాక్టర్ పాలూరి బోసు బాబు, చోడిశెట్టి గోపీనాథ్ గుప్తా, బత్తుల వీరభద్రరావు, పసుమర్తి మరిడి రాజు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించి వచ్చిన భక్తులందరికీ సంతృప్తిగా అన్న సమరాధ కార్యక్రమాన్ని నిర్వహించారు.

డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ ముసాయిదా ప్రచురణ

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనల ప్రకారం మండలంలోని గ్రామ సచివాలయాల్లో డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ ముసాయిదా ప్రచురణ చేసినట్లు అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, తహసిల్దార్ జి కనకరాజు శుక్రవారం తెలిపారు. ఈ ముసాయిదా ప్రకారం గ్రామంలోని ఓటర్లు వారికి సంబంధించిన లిస్టులో తమ తమ పేరు ఉన్నదీ, లేనిదీ సరిచూసుకుని, తప్పొప్పులు, మార్పులు చేర్పులు ఉన్నయెడల డిసెంబర్ 9వ తేదీ లోపు తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఏవేని మార్పులు, చేర్పుల కొరకు, మరేవేనీ ఆక్షేపణలుంటే ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారిని గాని, ఆయా గ్రామ సచివాలయాలలో బిఎల్‌ఓ లను గానీ సంప్రదించవచ్చని తెలిపారు.

పిఎంపి నూతన కమిటీలు ఏకగ్రీవం

విశాలాంధ్ర - అనపర్తి : అనపర్తి,బిక్కవోలు, రాయవరం మండలాల కమ్యూనిటీ ఫార్మా మెడిక్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్

అసోసియేషన్ (ది పిఎంపి అసోసి యేషన్) నూతన కమిటీల నియామకం ఏకగ్రీవంగా జరిగింది. శుక్రవారం రాయవరం వెలమ కమ్యూనిటీ భవన ఆవరణలో రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా కన్వీనర్ గంగుమళ్ల రాంబాబు, జిల్లాకు కన్వీనర్ బళ్ళా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ ఎంపిక జరిగింది. అనపర్తి , బిక్కవోలు మండల కన్వీనర్లుగా వాసంశెట్టి నాగేశ్వరరావు,కో కన్వీనర్లుగా డి సాయి రామారెడ్డి, నీలంశెట్టి శ్రీనివాస్,రాయవరం మండలం నూతన కమిటీ కన్వీనర్ గా నవుడు వెంకటరమణ, కన్వీనర్లు చింతా జగదీష్, ఎస్ శివ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాంబాబు, శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా మెడికవర్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో పి.ఎం.పి లు అందించవలసిన ప్రాథమిక వైద్యం కోసం వివరించారు. ఈ కార్యక్రమంలో కె వి వెంకటరెడ్డి, పరంశెట్టి శ్రీనివాస్, కెవిజికెరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుల ప్రచారం

విశాలాంధ్ర-పెరవలి : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు

నాయుడు అక్రమ అరెస్టును వ్యతిరేకిస్తూ నిడదవోలు నియోజకవర్గ టిడిపి నాయకులు కుందుల వీర వెంకట సత్యనారాయణ బాబుతో నేను, బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ప్రజలకు వివరిస్తూ పెరవలి మండలం,కానూరు అగ్రహారం గ్రామంలో శుక్రవారం ఇంటి ఇంటికి కరపత్రాలను పంచుతూ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నందిప రాజు గుండాల నాగ మునేశ్వరావు,పెన్నాడ పుత్రయ్య, చెన్న చిన్న శ్రీను, హరిదాసు పెద్దోడు, గరగ పెత్తందారు, పిల్లి గోవింద్, పాకా చిన్న అంబటి వెంకటరమణ అనపర్తి వెంకట నారాయణ (జయ) గ్రామ తెలుగుదేశం, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ విస్తృత స్థాయి సమావేశం

విశాలాంధ్ర - నిడదవోలు : పట్టణంలోని నందిన ఫంక్షన్ హాల్లో నిడదవోలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ఓటర్ లిస్ట్ పరిశీలన , 1 వ తారీఖు నుంచి మొదలయ్యే బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహణ,టెలిగ్రామ్ బాట్ లో అప్లోడ్ చేయడం గురించి ట్రైనింగ్ తదితర కార్యక్రమాల పై నియోజవర్గ క్లస్టర్, యూనిట్, బూత్ ఛార్జ్ లతో చర్చించారు. అనంతరం కార్యకర్తల నుండి వచ్చిన పలు అనుమానాలను నివృత్తం చెడు శేషారావు తగు సూచనలను చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ అధ్యక్షులు భూపతి రాజు రవివర్మ, మండల టీడీపి అధ్యక్షులు వెలగన సూర్యారావు, పట్టణ టీడీపి అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంతిమ విశ్వరూప సభను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - జగ్గంపేట : మాదిగల అంతిమ విశ్వరూప సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి ఉత్తర కోస్తాంధ్ర,

సీమాంధ్ర జిల్లాల ఇంచార్జి ముమ్మిడివరపు చిన సుబ్బారావు మాదిగ పిలుపునిచ్చారు. జగ్గంపేట ఆశీర్వాద్ కాంప్లెక్స్ అవరణంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నవంబర్ 18వ తేదీన హైదరాబాద్ జరిగే మాదిగల విశ్వరూప మహాసభకు ప్రధాని నరేంద్ర మోడీ వస్తున్నారని, ఆ సభను విజయవంతం చేయాలన్నారు. యువకులు ప్రతి ఇంటికీ కరపత్రాన్ని అందించి ఏబిసిడి వర్గీకరణ కోసం చేస్తున్న పోరాటం గురించి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి కాకాడ నూకరాజు మాదిగ, ఎంఈఎఫ్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల కన్వీనర్ తాతపూడి వెంకటేష్ మాదిగ, ఎంఈఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు రాచర్ల అప్పారావు మాదిగ, ఎంఆర్‌పిఎస్ జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఓపెన్ హౌస్

విశాలాంధ్ర - కాకినాడ : "ఓపెన్ హౌస్" విద్యార్థినీ - విద్యార్థులకు అవగాహన ప్రదర్శనను కాకినాడ జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ ప్రారంభించారు. పోలీసు అమర

వీరుల సంస్మరణ కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో పోలీసు శాఖ నిర్వహణతీరు, పోలీసు విధులకు అనుసంధానంగా ఉపయోగించే వ్యవస్థలపై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించే ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ కాకినాడ అర్బన్, రూరల్ శాసనసభ్యులు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కురసాల కన్నబాబు, శాసన మండలి సభ్యురాలు కర్రి పద్మశ్రీ, కుడా చైర్పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, కాకినాడ మునిసిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ సుంకర శివ ప్రసన్నల సమక్షంలో ప్రారంభించారు. ఈ ఓపెన్ హౌస్‌లో కాకినాడ పట్టణం,సమీప ప్రాంతాల కళాశాల , పాఠశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరు కాగా వారికి జిల్లా ఎస్పీ స్వయంగా పోలీసు సిబ్బంది వారి విధి నిర్వహణలో వినియోగించే పరికరాలు, సాధనాలు, సాంకేతిక ఉపకరణాల గురించి విద్యార్థులకు స్వయంగా వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు పరిపాలన పి శ్రీనివాస్, ఆర్మ్డ్ రిజర్వ్ బి సత్యనారాయణ, ఎస్‌ఇ బి ప్రేమ్ కాజల్, డిఎస్‌పిలు పి మురళీ కృష్ణారెడ్డి, ఎస్ రాంబాబు, జయరాం ప్రసాద్‌లు ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ అధికారులు మరియు సిబ్బంది, జిల్లా పోలీస్ కార్యాలయ వివిధ విభాగాల అధికారులు మరియు సిబ్బంది, కాకినాడ పట్టణ స్టేషన్‌ల ఇన్స్పెక్టర్‌లు పాల్గొన్నారు.

రక్షణకరమైన అందానికి ప్రాధాన్యత ఇవ్వాలి

విశాలాంధ్ర - కాకినాడ : ఆరోగ్యకరమైన రక్షణతో కూడిన అందాల సలహాలు ఇవ్వాలని

కాకినాడ జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ అన్నారు. ప్రముఖ డెర్మటాలజిస్ట్ డాక్టర్ నల్లమిల్లి మాధురిచే స్థానిక ఆర్టిసి బస్టాండ్ సమీపాన నూతనంగా ఏర్పాటు చేసిన మాధురీ స్కిన్, హెయిర్ అండ్ లేజర్ క్లీనికన్ను జిల్లా ఎస్పి ఎస్.సతీష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ ఆరోగ్యకర అందంద్వారా శరీరాన్ని పరిరక్షించుకునే నూతన సాంకేతిక వైద్య విధానం తొలిసారిగా కాకినాడలోకి అందుబాటులోకి రావడం శుభపరిణామమని అన్నారు. మారుతున్న యువత సరికొత్త ఆలోచనలకు అనుగుణంగా ఈ కాస్మటాలజీ లేజర్ క్లీనిక్ కాకినాడలో ఏర్పాటు చేసిన డాక్టర్ మాధురిని అభినందించారు. కాస్మోటాలజి క్లీనిక్ అధినేత డాక్టర్ మాధురి మాట్లాడుతూ నేటిసమాజంలో వాతవరణ కాలుష్యం బాగా పెరిగిపోయిన తరుణంలో జంక్ ఫుడ్స్, మానసిక ఒత్తిడులవల్ల మనిషి అందంతోపాటు అనారోగ్యానికి గురౌతున్నారని అన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అతిధులు ఎస్పి సతీష్ కుమార్, ప్రముఖ డెర్మటాలజిస్ట్ దామెర రామారావును మాధురి ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేసారు. కవ స్థల సాయిధ్యతి ఫౌండేషన్ ట్రస్ట్ డైరెక్టర్లు ఎస్. ప్రతాపరెడ్డి, ప్రముఖ ఆడిటర్ యు మురళి కృష్ణ, డాక్టర్ శుభశేఖర్ రెడ్డితో పాటు నగరంలో ఉన్న ప్రముఖ వైద్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నవంబర్ 3న పరీక్ష పగడ్బందీగా నిర్వహించాలి

విశాలాంధ్ర - శంఖవరం : నవంబర్ మూడవ తేదీన జరిగే పరీక్షలను

ఉపాధ్యాయులంతా కలిసి పగడ్బందీగా నిర్వహించాలని శంఖవరం మండల విద్యాశాఖాధికారి సూరిశెట్టి వెంకట రమణ తెలిపారు. శుక్రవారం సాయంత్రం శంఖవరం మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అవగాహన సమావేశం నిర్వహించి మాట్లాడారు. 3, 6, 9 తరగతి విద్యార్థులకు గణితం, ఇంగ్లీష్, అంగ్ల మాధ్యమంలో ఓఎంఆర్ ప్రశ్నా పత్రాల ద్వారా పరీక్షలు నిర్వహించేలా విద్యార్థులకు ఎప్పటినుంచే తర్ఫీదు నివ్వాలని ఎంఈఓ కోరారు. మూడో తరగతి విద్యార్థులకు మూడవ తరగతి, ఆరో తరగతి విద్యార్థులకు 5వ తరగతి 9వ తరగతి విద్యార్థులకు 8వ తరగతి సిలబస్ చదివించాలని శంఖవరం 2వ ఎంఈఓ గోవిందు అన్నారు. ఈ కార్యక్రమంలోఎమ్ఈఓ2 గోవిందు, పెదమల్లాపురం హెచ్ఎం కెవిఎస్ మూర్తి, కత్తిపూడి హెచ్ఎం ఆకెళ్ళ శ్రీనివాస్, రాంబాబు, కె వెంకటేశ్వరరావు, మూర్తి, శారదా ప్రిన్సిపల్ బోనగిరి శ్రీనివాస్, శివకుమార్, సీఆర్పీలు డి రాజబాబు, ఎస్ నాని బాబు, స్వర్ణలత, నాగరాజు, ఈశ్వరరావు, పాల్గొన్నారు.

పంట నమోదులో ప్రతి రైతు పేరు సరిచూసుకోవాలి

విశాలాంధ్ర - కిర్లంపూడి : పంట నమోదు ప్రక్రియలో ప్రతి రైతు విధిగా తమ పేరు ఉందో లేదో సరి చూసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిని జోకా అమృత సూచించారు. కిర్లంపూడి మండల పరిధిలోని 2023 ఖరీఫ్ పంట నమోదుకు సంబంధించిన సోషల్ ఆడిట్ లిస్టులను పలు గ్రామల సచివాలయాల్లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జోకా అమృత మాట్లాడుతూ ఈనెల 29వ తేదీ వరకు అన్ని రైతు భరోసా కేంద్రాల్లోనూ పంట నమోదుకు సంబంధించిన పేర్ల జాబితాను పెట్టడం జరిగిందన్నారు. రైతు తమ పేరు జాబితాలో ఉందో లేదో గమనించుకోవాలన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు మళ్ల రామకృష్ణ, పలువురు రైతులు ఉన్నారు.

చెకుముకి సైన్సు సంబరాలు గోడపత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర - పిఠాపురం టౌన్ : స్థానిక ఎమ్మార్సీ భవనంలో చెకుముకి సైన్స్ సంబరాలు గోడ పత్రిక ఆవిష్కరణ జరిగింది. పిఠాపురం మండలం ఎంఈఓ నారాయణదాసు జన విజ్ఞాన వేదిక-చెకుముకి సైన్స్ సంబరాలు 2023 గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి జన విజ్ఞాన వేదిక కృషి చేస్తుందని కొనియాడారు. ప్రతి విద్యార్థిలోనూ సైన్స్ పట్ల అవగాహన కలిగినప్పుడు మాత్రమే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఈ సంవత్సరం జరిగే చెకుముకి సైన్ సంబరాల్లో పిఠాపురం మండలంలోని అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ మరియు ప్రైవేటు పాఠశాలలో ఆరో తరగతి నుండి పదవ తరగతి వరకు విద్యార్థులందరూ పాల్గొనేలా యాజమాన్యాలు కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

'దీపావళి షాపోత్సవ్' 2023ని ప్రకటించిన ఫ్లిప్‌కార్ట్ హెూల్‌సేల్

విశాలాంధ్ర-రాజమండ్రి: భారతదేశంలో స్వదేశీయంగా అభివృద్ధి చెందిన ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ యొక్క డిజిటల్ బీ 2బీ ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్ అయిన ఫ్లిప్‌కార్ట్ హెూల్‌సేల్, ఈరోజు తమ బీ2బీ సభ్యుల కోసం దీపావళి షాపోత్సవ్‌ను అక్టోబర్ 25 నుండి నవంబర్ 12, 2023 వరకు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. 'బోలో ఫైదే కి బోలి' అనే ట్యాగ్‌లైన్‌తో జరిగే ఈ వార్షిక విక్రయం మొత్తం 26 స్టోర్‌లలో అలాగే ఫ్లిప్‌కార్ట్ హెూల్‌సేల్ యాప్‌లో అందుబాటులో ఉంటుంది. తమ ట్యాగ్‌లైన్‌కు అనుగుణంగా, దీపావళి షాపోత్సవ్ విభిన్న విభాగాలలో ఈ సీజన్‌లో అతిపెద్ద డీల్‌లను వేడుక చేసుకుంటుంది. ఈ సంవత్సరం, గృహ%ఉ%వంటగది ఉపకరణాలు, బహుమతి మరియు పండుగ అలంకరణ వస్తువులు వంటి కొత్తగా ప్రారంభించబడిన కేటగిరీలపై ప్రత్యేక దృష్టి సారించింది. పండుగ ఉల్లాసాన్ని మరింత పెంచేందుకు, రోజువారీ ఫ్లాష్ డీల్‌లు ప్లాన్ చేయబడ్డాయి, ఇందులో బ్రాండ్‌లు సభ్యులకు 2 కిలోల చక్కెర అనేక ఇతర వస్తువులను అందిస్తాయి. అదనంగా, కిరాణా సభ్యులు లక్కీ డ్రా ఆఫర్‌లో భాగంగా సరికొత్త మహీంద్రా థార్, మొబైల్ ఫోన్‌లు, బంగారం మరియు వెండి నాణేలతో సహా అద్భుతమైన బహుమతులను గెలుచుకునే అవకాశం ఉంటుందని ఫ్లిప్కార్ట్ ప్రతినిధి చెప్పారు.

ఫాస్ట్రాక్ నుంచి పార్టీ వేర్ వాచ్ వీవైబీ

విశాలాంధ్ర-రాజమండ్రి: భారతదేశపు ఐకానిక్ యూత్ బ్రాండ్, ఫాస్ట్రాక్, ఇటీవల యువతుల కోసం ప్రత్యేకంగా ఒక సబ్-బ్రాండ్ అయిన వీవైబీని ప్రారంభించింది. చిక్, స్టైలిష్ మరియు వినూత్నమైన వీవైబీ ట్రెండ్‌లు తాజా డిజైన్‌ల ప్రపంచాన్ని ఆస్వాదించే ఫ్యాషన్‌వాదులకు అంకితం చేయబడింది. ప్రస్తుత ఫాస్ట్-ఫ్యాషన్ ప్రాధాన్యతలపై దృష్టి సారించి, వీవైబీ బై ఫాస్ట్రాక్ అన్ని రకాల పార్టీల కోసం అందాన్ని మెరుగుపరిచే అద్భుతమైన, విలువైన పీస్ ల కోసం వెతుకుతున్న వారికి అందిస్తుంది. మొదటి కలెక్షన్ డ్రాప్‌లో 71 ఉత్కంఠభరితమైన డిజైన్‌లు ఉన్నాయి. విభిన్నమైన మరియు అలంకరించబడిన పట్టీలు, కొత్త ప్లేటింగ్ రంగులు మరియు ఆసక్తికరమైన డయల్ ఆకారాల శ్రేణితో, బ్రాండ్ ప్రతి మూడ్ మరియు క్షణానికి వాచ్ ఉండేలా చేస్తుంది. అన్నింటికంటే అగ్రగామిగా, ఈ వాచీలు సరసమైన ధర శ్రేణి లో రూ. 1250 నుండి రూ. 2960 మధ్య లభిస్తాయి. వీవైబీ విడుదలతో, ఫాస్ట్రాక్ తన పోర్ట్‌ఫోలియోను కొత్త డిజైన్లతో విస్తరింపజేస్తుంది, ఇది ఫ్యాషన్-ఫార్వర్డ్ యువతుల కోసం బ్లింగ్ టచ్ కలిగి ఉంది, వారి స్వేచ్ఛా స్ఫూర్తితో కూడిన పార్టీ వైబ్‌ను అత్యంత విశ్వాసంతో ప్రదర్శించేలా వారిని ప్రోత్సహిస్తుంది.